క్లుప్తంగా

సీఎం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



కాన్గల్‌లో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్ గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఫ్లెక్సీకి కాంగ్రెస్ నాయకులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. గ్రామానికి 30 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి పూర్వవిద్యార్థుల చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): గుండెపోటుతో మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి పూర్వ విద్యార్థులు అండగా నిలిచారు. మండలంలోని తిగుల్‌కు చెందిన కుద్దుస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకొన్న పదోతరగతి చదువుకున్న స్నేహితులు ఆదివారం కుద్దుస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం అతడి కూతురు పేరు మీద రూ.50 వేలు బ్యాంక్‌లో డిపాజిట్‌చేసి ఆ పత్రాన్ని అందించారు. కూతురు చదువుకు ఖర్చు చేసుకోవాలని, ఆపదలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, పూర్వ విద్యార్థులు ప్రవీణ్, పరమేశ్వర్, ఐలయ్య, మహేశ్, పప్పుమియా, మల్లేశం, కరుణకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట రన్నర్స్ ప్రతిభ



10కే రన్‌లో పాల్గొన్న సిద్దిపేట రన్నర్స్

సిద్దిపేటజోన్: బెంగళూరులో టీపీఎస్ వరల్డ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 10కే రన్‌లో సిద్దిపేట రన్నర్స్ ప్రతిభ చూపారు. ఈ మారథాన్‌లో సిద్దిపేటకు చెందిన రాజు, నారాయణరెడ్డి వీరన్న గోపాల్, శ్రీహరి, లింగారెడ్డి, శ్రవణ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి మాట్లాడతూ పోటీలు ఎక్కడ జరిగినా పాల్గొని తాము ప్రతిభ చూపుతున్నామన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న ఏఎస్‌ఐ మణెమ్మ

హుస్నాబాద్‌రూరల్: ప్రజలంతా సైబర్, ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ మణెమ్మ పిలుపునిచ్చారు. పొట్లపల్లిలో శనివారం రాత్రి పోలీసు కళాజాత ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తుతెలియని వారి నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ విషయంలో జాగ్రత్త వహించాలని, ఎవరికీ ఎలాంటి విషయాలు చెప్పకూడదని వివరించారు. అలాగే మద్యం, గంజాయి లాంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు కళా బృందం సభ్యులు పాల్గొన్నారు.

శాంతి చర్చలు జరపాలి

సిద్దిపేటకమాన్: కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను పాటించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని ప్రజా సంఘాల నేతలు కోరారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపేయాలన్నారు. దండకారణ్యంలో ఆదివాసులపై ప్రభుత్వం జరుపుతున్న దాడి అప్రజాస్వామికం అన్నారు. ఆదివాసులకు మద్దతుగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నవీన్, ఎల్లం, భాను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గజ్వేల్: గజ్వేల్ మండలం అహ్మదీపూర్ 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం మరమ్మతులు కారణంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజ్ఞాపూర్ విద్యుత్ శాఖ ఏఈ సత్యం తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

కసరత్తు.. ఆరోగ్యం మా సొత్తు

- అన్ని గ్రామాల్లోనూ ఓపెన్ జిమ్‌లు
- సద్వినియోగం చేసుకుంటున్న స్థానికులు

జీవనశైలి మారింది. మారుతున్న కాలంతో పాటు జీవనంలో వేగం పెరిగింది. దీంతో అలసట, ఒత్తిడి అధికమైంది. ఆహార పానీయాలు తీసుకోవడంలో కూడా ఎన్నో మార్పులొచ్చాయి. దీంతో ఎన్నో వ్యాధుల బారిన పడాల్సిన పరిస్థితి. వాటిని అధిగమించడానికి వ్యాయామం తప్పనిసరైంది. అందుకు ఓపెన్ జిమ్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

అక్కన్నపేట(హుస్నాబాద్): జిమ్‌లకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేయకుండా గ్రామాల్లోనే ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో దాదాపు అన్ని గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లను నిర్మించారు. వాటి నిర్మాణానికి సుమారు రూ.5లక్షలు కేటాయించారు. మండలంలో 31 గ్రామాలు ఉండగా ఇటీవల మరో ఆరు గ్రామాలు ఏర్పడ్డాయి. దీంతో ప్రస్తుతం మొత్తం 37 గ్రామాలు ఉన్నాయి. అందులో సగానికిపైగా గ్రామాల్లో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. జిమ్‌లను ఉదయం, సాయంత్రం వినియోగించుకొంటున్నామని, ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జిమ్‌ల ఏర్పాటు విషయంలో చొరవ తీసుకొన్న మంత్రి పొన్నంకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని స్థానికులు చెప్పారు.

కొత్త అనుభూతి

బహిరంగ ప్రదేశాలలో ఏర్పాటు చేసిన జిమ్‌లలో



జనగామలోని ఓపెన్ జిమ్‌లో కసరత్తు చేస్తున్న స్థానికులు

కసరత్తు చేయడం కొత్త అనుభూతిని కలిగిస్తుందని పర్యావరణ వేత్తలు అంటున్నారు. ప్రైవేటు జిమ్‌లకు వెళ్లే స్తోమతలేని పేద, మధ్యతరగతి ప్రజలకు ఈ జిమ్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ప్రతి రోజు వ్యాయామం చేయడంతో ఫిట్‌నెస్‌తో పాటు ఆరోగ్యం కూడా సొంతం చేసుకొంటున్నారు.

బోర్లు వేసి.. నీటి వెతలు తీర్చి

- రూ.2.5 లక్షలతో కొనసాగుతున్న పనులు
- ఔదార్యం చాటుకున్న ఏఎంసీ వైస్ చైర్మన్

ములుగు(గజ్వేల్): నీటికి కటకటలాడుతున్న మండలంలోని బహిలంపూర్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసులకు వంటిమామిడి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొడిత్యాల ప్రభాకర్ బోర్లు తవ్వించి తన ఔదార్యాన్ని చాటుకొన్నారు. సుమారు రూ.2.50 లక్షల సొంత నిధులు వెచ్చించి కాలనీలో ఆదివారం రెండు బోర్లు తవ్వించారు. వాటిలో సమృద్ధిగా నీరు రావడంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ బోర్లకు మోటార్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తన ఊరి సమస్యను తానే పరిష్కరించే అవకాశం దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు.



బోరు తవ్వకాలను ప్రారంభిస్తున్న ప్రభాకర్

విజ్ఞానం పెంపొందించడానికే శిక్షణ

ఎంఈఓ సత్తయ్య



విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈఓ సత్తయ్య

కొండపాక(గజ్వేల్): సమ్మర్ క్యాంపులు విద్యార్థులకు మరింత విజ్ఞానం పెంచుతాయని మండల విద్యాధికారి(ఎంఈఓ) బచ్చలి సత్తయ్య అన్నారు. మండలంలోని తిప్పారం ప్రాథమిక పాఠశాలల్లో సమ్మర్ క్యాంపులో భాగంగా జరుగుతున్న కథల పోటీలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరాలలో నేర్పించే వివిధ అంశాలు విద్యార్థుల్లో వినోదాన్ని, విజ్ఞానాన్ని పెంచుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఈ శిబిరాలు దోహద పడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చీల రవి, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, మాధురి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో హెచ్‌ఎం నర్సింహులు

సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాలి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల పరిధిలోని ముక్తమాసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్లాస్టిక్ నియంత్రణ, మానవతా విలువలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ జెండా ఎగరడం ఖాయం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గజ్వేల్‌రూరల్: మున్సిపాలిటీలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ నాయకులు అన్నారు. ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవినీతిపై విమర్శలు చేసిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు మాట్లాడడం లేదన్నారు. ప్రధాని మోదీ పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి, సత్తయ్య, శశిధర్‌రెడ్డి, జనార్దన్, వెంకట్‌రెడ్డి, సుమతి, రాణి, నీరజ, మమత, భక్తమాల తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న గ్రామస్తులు

ఉగ్రవాదుల దాడి అమానుషం

చిన్నకోడూరు(సిద్దిపేట): కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడి అమానుషమని అనంతసాగర్ గ్రామస్తులన్నారు. ఆ దాడిలో మృతి చెందిన వారికి ఆదివారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ర్యాలీ నిర్వహించి రెండు నిమషాలు మౌనం పాటించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ముగిసిన మోడల్ ప్రవేశ పరీక్ష

దుబ్బాకటౌన్/బెజ్జంకి(సిద్దిపేట): మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 నుంచి 12 వరకు జరిగిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 284 మందికి గాను 266 మంది, అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ఏడో తరగతి నుంచి పదో తరగతి నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 243 మందికి గాను 218 మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తెలిపారు. అలాగే బెజ్జంకి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు.

రేణుక ఎల్లమ్మకు పూజలు

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని గౌడ సంఘం ఆధ్వర్యంలో 24న ప్రారంభమైన రేణుక ఎల్లమ్మ తల్లి పండుగ శనివారం రాత్రి ఘనంగా ముగిసింది. ఆలయంలో మాజీ సర్పంచ్ పద్మతో పాటు పలువురు భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఎల్లమ్మ తల్లిని వేడుకొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు, యూత్‌సభ్యులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, ఆర్‌బీఎల్ నాయకులు

గజ్వేల్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొడదామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో ఆదివారం ఆర్‌బీఎల్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించి, దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడేను విజయవంతం చేయాలన్నారు. మే 20న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో బీఎంఎస్ మినహా అన్ని కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు పాల్గొంటాయని చెప్పారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం చట్టాలను రూపొందించి కార్మికులకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. కనీస వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, ధరలను తగ్గించడంతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేపట్టామని చెప్పారు. అదే విధంగా ఆర్‌బీఎల్ పరిశ్రమ గుర్తింపు సంఘం ఎన్నికల్లో సీఐటీయూను అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్, భిక్షపతి, స్వామి, రంగారెడ్డి, మల్లయ్య, నర్సింహులు, రాజగోపాల్, స్వామి, ఎల్లయ్య, వెంకటేశ్, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, గురువులు



గురువులతో 1999-2000 బ్యాచ్ విద్యార్థులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వీరన్నపేట పాఠశాలలో 2004–2005 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకొని సమ్మేళనం జరుపుకొన్నారు. 20 యేళ్ల తర్వాత కలుసుకున్న వారంతా చిన్ననాటి స్మృతులను గుర్తు చేసుకొన్నారు. అనంతరం వారి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుంపలపల్లి పాఠశాలలో..

దుబ్బాకటౌన్: దుంపలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. వారికి చదువు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి హెచ్‌ఎం, ప్రస్తుత ఎంఈఓ ప్రభుదాస్, అశోక్‌రాజు, రమేశ్, ఉపాధ్యాయులు ఫారుఖ్, మధుసూదన్‌రెడ్డి, వెంకట నర్సింగం, బ్రహ్మాచారి, రాజిరెడ్డి, విక్టోరియా, విద్యార్థులు పాల్గొన్నారు.

బగలాముఖీ శక్తిపీఠంలో హరిద్రార్చన

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో కొలువైన బగలాముఖీ శక్తిపీఠంలో ఆదివారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. బగలాముఖీ ఉపాసకుడు, వేద పండితుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో మహా మంత్ర హవనం, హరిద్రార్చన, విశేష పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కమలేశ్ తదితరులు ఉన్నారు.

హనుమాన్ ఆలయంలో ..

నర్సాపూర్: నర్సాపూర్‌లోని బస్టాండ్ హనుమాన్ ఆలయంలో ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదం, అన్న ప్రసాదం అందజేశారు. ప్రతినెలా అమావాస్య రోజు ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు చెప్పారు.



శివ్వంపేట(నర్సాపూర్): బగలాముఖీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

నల్లపోచమ్మదేవి ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి గ్రామ సమీపంలోని నల్లపోచమ్మదేవి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దేవాదాయశాఖ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌స్పెక్టర్, ఆలయ ఇన్‌చార్జి ఈఓ రంగారావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్, విఘ్నేశ్ నల్లపోచమ్మదేవికి పంచామృతాలతో అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి ఒడిబియ్యం పోసి కుంకుమార్చన చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కదలిన బీఆర్‌ఎస్ దండు

వరంగల్‌లోని ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభకు జిల్లా వ్యాప్తంగా అన్ని పట్టణాలు, మండలాలు, గ్రామాల నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు గులాబీ జెండాలను ఆవిష్కరించారు. వివిధ వాహనాలల్లో అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.



హుస్నాబాద్: పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రజిత



నంగునూరులో బీఆర్‌ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ



చేర్యాల(సిద్దిపేట): సభకు తరలి వెళ్తున్న మహిళలు, నాయకులు



జగదేవపూర్(గజ్వేల్): తిగుల్‌లో జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



సిద్దిపేటజోన్: 42వ వార్డులో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణ



కొండపాక(గజ్వేల్): కొండపాక నుంచి తరలి వెళ్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డి నుంచి...

గులాబీ సైన్యం చూసి బెంబేలు



దుబ్బాకలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

- కాంగ్రెస్, బీజేపీ నేతల్లో గుబులు
- నియోజక వర్గం నుంచి 15 వేలకు పైగా తరలిన శ్రేణులు
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: ఎల్కతుర్తికి కదిలిన గులాబీ సైన్యం బీజేపీ, కాంగ్రెస్ నేతల గుండెల్లో గుబులు రేపిందని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన దుబ్బాకతో పాటు మండలంలోని పెద్దగుండవెల్లి, తిమ్మాపూర్‌లో పార్టీ జెండాలను ఎగురవేశారు. అనంతరం రజతోత్సవ సభకు కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన కూడా బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి బస్సులో బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా తాము సభకు వస్తాం, కేసీఆర్ ప్రసంగం వింటామంటూ వందలాది మంది ముందుకు వచ్చారన్నారు. వాహనాల కొరతతో తీసుకుపోలేకపోతున్నామని చెప్పారు. నియోజకవర్గం నుంచి 15 వేలకు పైగా గులాబీ సైనికులు హాజరవుతున్నారని తెలిపారు. ప్రజల ఆదరణ చూస్తుంటే మళ్లీ కేసీఆర్ సీఎం కావడం ఖాయమన్న సంకేతాలు కనిపిస్తున్నాయని చెప్పారు. సభకు ఆటంకాలు కల్పించేందుకు అధికార పార్టీ ఎన్నో ఎత్తుగడలు వేసినా ప్రజలు తిప్పికొట్టి దండుగా కదిలారన్నారు.